## రాష్ట్రాన్ని అవమానించిన మోదీకి ఓటెందుకేయాలి?

- రేవంత్ రెడ్డివి చిల్లర మాటలు.. ఉద్దెర పనులు
- బడే భాయ్, చోటే భాయ్.. ఇద్దరూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారు
- కాంగ్రెస్, బీజేపీలు కరీంనగర్‌లో మ్యాచ్ ఫిక్సింగ్
- రాష్ట్రానికి గులాబీ జెండానే కాపాలాదారి
- కష్టపడి పని చేస్తే విజయం మనదే..
- వేములవాడ బూత్ కమిటీ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వేములవాడ, ఏప్రిల్ 28 : తెలంగాణ పుట్టుకను అవమానించిన ప్రధాని నరేంద్ర మోదీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ఎందుకు వేయాలి? అని బీఆర్‌ఎస్ వ ర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని మహారాజ ఫంక్షన్ హాల్‌లో వేములవాడ నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్న గడువు వచ్చే జూన్ మాసంలో అయిపోతున్నదని, ఎవరైనా హైదరాబాద్‌ను కేంద్రప్రాంతపాలితంగా ప్రకటిద్దామని ఆలోచన చేస్తే దానిని అడ్డుకునే శక్తి ఒక గులాబీ పార్టీకే ఉందని స్పష్టం చేశారు. ఇక దేశంలో 400 సీట్లు గెలిపిస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు కూడా ఎత్తివేస్తామని బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, ఇలాంటి వాటిని అడ్డుకునే శక్తి కూడా మనకే ఉందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలిసిన నాయకుడు వినోద్‌కుమార్ పార్లమెంట్‌లో ఉంటే మన సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఇక 100 రోజుల్లో చోటే భాయ్, 2014 నుంచి బడే భాయ్ ఇద్దరూ ప్రజలను మోసం చేశారని తెలిపారు. 2022 కల్లా రైతుల ఆదాయం డబుల్ చేస్తానని చెప్పి కష్టాలను మాత్రం డబుల్ చేసిందని బీజేపీ సర్కారును దుయ్యపట్టారు. రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని, బులెట్ రైలు తెస్తామని చెప్పిన నాయకుడు మోదీ మన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ కూడా పూర్తి చేయలేక పోయారని తెలిపారు. ఐదు ట్రిలియన్ డాలర్ల స్థాయికి దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తానని చెప్పిన నాయకుడి తీరుతో రూపాయి పాతాళంలోకి వెళ్లగా అప్పులు ఆకాశాన్ని అంటాయని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర విభజనలో ఇచ్చిన వాటిని ఏమి కూడా మోదీ సర్కారు అమలు చేయలేదన్నారు. హైదరాబాద్‌కు ఉన్న ఐటీఐఆర్‌ని కూడా ఎత్తివేసిందని తెలిపారు. మోదీ పదేళ్ల పాలనలో ప్రజలకు తీరని ద్రోహం చేశారని తీవ్రంగా విమర్శించారు. 2014లో రూ.400 ఉన్న సిలిండర్ రూ.1200 పెంచారని, ముడిచమురు బ్యారెల్ 100 డాలర్లు ఉండగా ప్రస్తుతం 86 డాలర్లకు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. పెరిగిన ఇంధన ధరలతో అనేక వస్తువుల మీద భారంపడి సామాన్య ప్రజలపై కూడా పడిందన్నారు. జాతీయ రహదారుల మీద సెస్ పేరిట రూ.30 లక్షల కోట్లు వసూ లు చేసి ఇందులో సగం రూ.14లక్షల కోట్లు అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ రంగాల రుణ ఎగవేతదారులకు అందించాడని ఆరోపించారు. యువతలో మతవిద్వేషాల విషం నింపి ఇదే పని అన్నట్లుగా తప్పుదోవ పట్టిస్తున్నాడని మండిపడ్డారు.

### మంచిచేసే వాళ్లనే రాముడు గెలిపించుకోమన్నడు

శ్రీరాముడు అందరివాడని, ఎమ్మెల్యే, ఎంపీ కాదని, మంచి పని చేసే వాళ్లకు మాత్రమే అధికారం ఇవ్వాలని ఆయన చెప్పాడని కేటీఆర్ గుర్తు చేశారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ దేశం కోసం.. ధర్మం కోసం అని మాట్లాడుతాడని, ఐదు పైసల పని కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట సీతారామస్వామి, సిరిసిల్ల మార్కండేయ ఆలయాలకు ఒక్క రూపాయి అయినా కేంద్రం నుంచి తెచ్చాడా? అని ప్రశ్నించారు. 2014 నుంచి 2019 వరకు వినోద్‌కుమార్ పనిచేశారని, 2019 నుంచి ఇప్పటి దాకా బండి సంజయ్ ఇదే బీజేపీ పరిపాలనలో ఎంపీగా ఉన్నారని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎవరెన్ని నిధులు తెచ్చారో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

నాయకులతో కేటీఆర్ కరచాలనం

### కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్, బీజేపీది మ్యాచ్ ఫిక్సింగ్ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద కండువా తీసి నిలబెడితే ఎవరూ గుర్తుపట్టరని, ఆ పార్టీ కార్యకర్తలు కూడా గుర్తుపట్టలేరని ఎద్దేవా చేశారు. నిజానికి కరీంనగర్‌లో జీవన్‌రెడ్డి లేదా ప్రవీణ్‌రెడ్డి వంటి నాయకులు పోటీ చేయాల్సి ఉండేదని, వీరిద్దరైతే గట్టిపోటీ ఇస్తారని సీఎం రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ డమ్మీ క్యాండెట్‌ను ఎంపిక చేశారన్నారు.

### రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు

సీఎం రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు.. ఉద్దెర పనులని కేటీఆర్ విమర్శించారు. లంకె బిందెలు దొరుకుతాయని వచ్చానని మాట్లాడడమే కాకుండా జేబులో కత్తెరలు పెట్టుకొని తిరుగుతున్నానని చెప్పడం చిల్లర మాటలలాగే ఉన్నాయన్నారు. ఇక సంక్షేమ పథకాల్లో అన్నీ ఉద్దెర ఖాతాలేనని విమర్శించారు.

### ఆది సీనన్న తులం బంగారం ఇప్పించు

నిరుపేద యువతి వివాహానికి బంగారం కూడా ఇస్తామని ఎన్నికల్లో మాయమాటల హామీలు ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. వేములవాడలో బంగారం దుకాణాలు లేవా? ఆది శ్రీనన్నకు చెప్పి ఇప్పించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు.

### 70 ఏళ్ల వయసులోనూ కష్టపడుతున్నారు

70 ఏళ్ల వయసులో తొంటి ఎముక విరిగిన పార్టీ అధినేత కేసీఆర్ బస్సు యాత్రతో ప్రజల వద్దకు వచ్చి ప్రచారం చేస్తూ కష్టపడుతున్నారని కేటీఆర్ తెలిపారు. 12 బీఆర్‌ఎస్ సీట్లు గెలిపిస్తే రాష్ట్ర రాజకీయాలను శాసించే రోజు ఏడాదిలోపే వస్తుందని కార్యకర్తలకు ధైర్యాన్ని నింపారు. ప్రతిరోజూ ఉదయం ఒక గంట సాయంత్రం రెండు గంటలు బూత్ కమిటీలో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ పథకాల వైఫల్యాలు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఓట్లు అడగాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీలు పక్కన పెట్టి తల్లి లాంటి పార్టీకి కష్టం వచ్చినప్పుడు అందరూ అండగా నిలిచి కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

వేములవాడ పట్టణంలోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో జరిగిన బూత్ కమిటీ సమావేశంలో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా నినదిస్తున్న కార్యకర్తలు, నాయకులు

### ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిద్దాం

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిద్దాం. కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించుకుందాం. రాహుల్‌గాంధీని ముఖ్యమంత్రి చేసుకుందాం.. అంటూ ఇటీవల సోషల్‌మీడియా వేదికగా వైరల్ అయిన ఒక వీడియో చూస్తే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఎంత పరిజ్ఞానం ఉందో అర్థమవుతుంది. మన సమస్యలు తెలిసిన నాయకుడిగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని పార్లమెంట్‌కు పంపుదాం.

**- చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి**

### మనకున్న క్యాడర్.. జాతీయ పార్టీలకు లేదు

గ్రామస్థాయి నుంచి మొదలుకొని పట్టణాల వరకు బీఆర్‌ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌కు లేదు. కేవలం 1.8శాతం ఓట్లతో మాత్రమే మనం అసెంబ్లీ

ఎన్నికల్లో అధికారం కోల్పోయాం. కానీ మనం కోల్పోయింది అధికారం కాదు.. ప్రజా సేవ చేసే అవకాశాన్ని.. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రానికి గులాబీ జెండా అవసరం. ఓట్ల కోసం గోదావరి జలాలను తమిళనాడుకు తరలించే కుట్ర జరుగుతున్నది. దీనిని అడ్డుకునే శక్తి గులాబీ పార్టీకి మాత్రమే ఉన్నది. ఆ రోజుల్లో ఐదుగురు ఎంపీలుగా గెలిస్తే చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి అవహేళన చేసిన్రు. స్వ రాష్ట్ర సాధనలో ఐదుగురు ఎంపీలుగా ఉన్న తాము, 32 రాజకీయ పార్టీల దగ్గరకు వెళ్లి తెలంగాణను సాధించుకున్నది.

**- బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి**

### కష్టపడితే విజయం మనదే ..

బూత్ కమిటీల వారీగా ప్రతి కార్యకర్తా కష్టపడి పని చేస్తే లోక్‌సభ ఎన్నికల్లో విజయం మనదే.. పార్టీ శ్రేణులంతా ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలి. వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా సమష్టి విస్తృత ప్రచారం చేయాలి.

**- తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు**

## మల్లేశం మృతి తీరని లోటు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కమ్యూనిస్టు యోధుడు సామల మల్లేశం కు నివాళి


మల్లేశం(ఫైల్)

రాజన్నసిరిసిల్ల, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : పోరాట యోధుడు సీనియర్ సీపీఐ నాయకుడు సామల మల్లేశం మృతి కార్మిక వర్గాలకు తీరని లోటని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మరమగ్గాల కార్మికుల సమస్యలపై తాను హైదరాబాద్‌కు వచ్చి కలుస్తానంటే, అన్న నేనే సిరిసిల్లకు వచ్చి కలుస్తానని చెప్పానని, ఆయనను ఈవిధంగా కలుస్తానని కలలో కూడా అనుకోలేదన్నారు. నెలరోజులుగా అనారోగ్యానికి గురైన సామల మల్లేశం ఆదివారం ఉదయం మరణించారు. వేములవాడ కార్యకర్తల సమావేశానికి సిరిసిల్ల మీదుగా వెళ్తున్న కేటీఆర్‌ను మానేరు బ్రిడ్జి వద్ద బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి కలిసి, మల్లేశం మరణించాడన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బీవైనగర్‌లోని మల్లేశం నివాసానికి కేటీఆర్ చేరుకుని ఆయన భౌతిక కాయంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్నో పోరాటాలకు మార్గదర్శకత్వం వహించారన్నారు. కార్మిక పక్షపాతిగా బీడీ, మరమగ్గాల కార్మికుల సమస్యలపై జరిగిన అనేక ఉద్యమాలకు క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన మరణించడం బాధాకరమన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలోనూ, 2009 నుంచి 14 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పొత్తులో భాగంగా తనతో కలిసి పనిచేశారన్నారు. వస్త్ర పరిశ్రమ సమ్మె నేపథ్యంలో మరమగ్గాల కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు పలుమార్లు తనను కలిశారన్నారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని కోరుతున్నానన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్, టీఎస్‌టీపీఎస్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కార్యకర్తలు ఉన్నారు.

సామల మల్లేశం భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేటీఆర్

### పలువురు నేతల సంతాపం

విప్లవోద్యమ నాయకుడు సామల మల్లేశం (78) అనారోగ్యంతో మరణించడంపై పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి వెంకటస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, సీపీఐ నాయకులు గుంటి వేణు, నల్ల చంద్రమౌళి, పంతం రవి, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, కార్యదర్శి కోడం రమణ, శాంతిప్రకాశ్ శుక్లా, కాంగ్రెస్ నాయకుడు మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, అన్ని పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### బీఆర్‌ఎస్‌వీ నేతకు పరామర్శ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28: బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్‌కుమార్ తండ్రి రాజేంద్రప్రసాద్ ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఈమేరకు ఎమ్మెల్యే కేటీఆర్ సుభాష్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మానాల అరుణ్‌తోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, గాజుల బాలయ్య, నాయకులు ఉన్నారు.

## గీత కార్మికులకు అండగా ఉంటాం

- ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి
- మాజీ మంత్రి కేటీఆర్
- రగుడులో దగ్ధమైన తాటివనం పరిశీలన

రగుడు శివారులో దగ్ధమైన తాటివనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 28: కల్లుగీత కార్మికులకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు భరోసా ఇచ్చారు. ఆదివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు శివారులో ప్రమాదవశాత్తు దగ్ధమైన తాటివనాన్ని స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గీత కార్మికులతో మాట్లాడి, ప్రమాదానికి గల కారణం, నష్ట వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్‌తో తాను మాట్లాడానని, ప్రభుత్వ పరంగా గీత కార్మికులకు అందాల్సిన సహాయాన్ని, నష్టపరిహారాన్ని అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, గౌడ సంఘ అధ్యక్షుడు ఏశ పరశురాములు, కౌన్సిలర్ పోచవేణి సత్య, ఎల్లయ్య యాదవ్, మాజీ గౌడ సంఘ అధ్యక్షుడు గుగ్గిల్ల అజయ్‌గౌడ్, చందు, వంగ అనిల్, నరేశ్, సాయిదీప్, వంగ సురేష్, వంగ వెంకటేశం, సత్యనారాయణ, గౌడ సంఘం సభ్యులు, గీత కార్మికులు ఉన్నారు.

### సారంపల్లిలో పెద్దమ్మ కల్యాణోత్సవంలో..

తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఆదివారం జరిగిన పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణోత్సవానికి మాజీ మంత్రి కేటీఆర్ హాజరై, ఆలయంలో పూజలు చేశారు. ఇక్కడ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు బండి దేవదాస్‌గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, పడిగెల రాజు, ఎంపీటీసీ గుగ్గిల్ల లావణ్య, ఆంజనేయులు, మాజీ సర్పంచులు కొయ్యడ రమేశ్, సిరిసిల్ల పరశురాములు, బీఆర్‌ఎస్ నాయకులు బండి జగన్, తిరుపతి, శ్రీకాంత్ రెడ్డి, నవీన్‌రెడ్డి, పరశురాములు, ముదిరాజ్ సంఘ సభ్యులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఓట్లను అభ్యర్థించారు. మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో నిర్వహించిన ప్రచారంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 28: బోయినపల్లి వినోద్‌కుమార్‌కే ఓటేసి, పట్టం కట్టాలని తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండి జగన్ ఆధ్వర్యంలో ఇంటిం టా ప్రచారం చేశారు. మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్ కాలనీలో బీఆర్‌ఎస్ నేత లు ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, మాజీ సర్పంచ్ కోడం సంధ్యరాణి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సద్ద రోజా, క్యారం జగత్‌కుమార్, పడిగెల రాజు, కందుకూరి రామాగౌడ్, భానుమూర్తి, అనిల్‌గౌడ్, భిక్షపతి, తిరుపతి, రమేశ్, మనోహర్, సంతోష్, విజయ్, నవీన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట : బండలింగంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సిరిసిల్ల మున్సిపల్ 24 వవార్డు పరిధిలో కౌన్సిలర్ బుర్ర లక్ష్మి, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఇంటింటా కరపత్రాలను పంచుతూ కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నేతలున్నారు.

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ముమ్మర చేశారు. బండలింగంపల్లిలోమండల బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ప్రచారం చేశారు. పార్లమెంటు అభ్యర్థిగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పిల్లి కిషన్, బాల్‌రాజ్‌నర్సాగౌడ్, తడుకల స్వామి, గుల్లపల్లి నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట, ఏప్రిల్ 28: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని బీఆర్‌ఎస్ నేతలు బూత్ స్థాయిలో వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గతంలో ఐదేళ్లపాటు కరీంనగర్ పార్లమెంట్ మెంబర్‌గా వినోద్‌కుమార్ చేసిన సేవలకు తిరిగి పట్టం కడుదామని వారు ఓటర్లకు అవగాహన చేస్తూ ప్రచారం చేశారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, నేతలు ధన్‌రాజ్, ఎగదండి రవి, అర్జున్, ఇరిగి సందీప్, బాలరాజు ఉన్నారు.

రుద్రంగి, ఏప్రిల్ 28 : ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి గతంలో కేంద్రంతో పోరాడి నిధులు మంజూరు చేయించిన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం కోరారు. రుద్రంగి మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఇక్కడ గ్రామాధ్యక్షుడు దయ్యా ల కమలాకర్, బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్, మంచె రా జేశం, చెప్యాల గణేశ్, నాగులపెల్లి రవి, దయ్యాల పెద్దులు, పూదరి శ్రీనివాస్, తర్రె గంగారెడ్డి, నరేశ్, మోహన్ ఉన్నారు.

బోయినపల్లి, ఏప్రిల్ 28 : మోసం చేసే పార్టీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. విలాసాగర్, కొదురుపాక గ్రా మాల్లో ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా నాయకులు చెన్నాడి అమిత్‌కుమార్, మాజీ ఎంపీపీ సత్తినేని భాగ్యలత, సత్తినేని మాధవ్, మాజీ జడ్పీటీసీ లచ్చిరెడ్డి, మండలాధ్యక్షుడు కొండయ్య, నాయకులు అంజన్‌రావు, వేణుగోపాల్‌రావు ఉన్నారు.


సిరిసిల్ల రూరల్ : తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ మానస, మండలాధ్యక్షుడు రాజన్న,నేతలు


సిరిసిల్ల టౌన్ : వినోద్‌కు ఓటేయాలని కోరుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ


గంభీరావుపేట : మండల కేంద్రంలో ఓటు అభ్యర్థిస్తున్న నేతలు


బోయినపల్లి : విలాసాగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


రుద్రంగి : ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ, సెస్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


శాత్రాజుపల్లిలో నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 28 : వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ అధ్యాపకులను సన్మానించారు. ఇక్కడ విశ్రాంత ఎంఈవో రాజేందర్‌శర్మ, పూర్వ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, కిషన్, శ్రీనివాస్, అరుణ, ఆనందచారి, వెంకటరమణ, పూర్వ విద్యార్థులు మమత, ఆకాంక్ష, పద్మ, స్వప్న, గౌతమి, రజిత, శారద, కిషన్, శ్రావణ్, వెంకటేశ్ ఉన్నారు.

## పక్షుల దాహార్తి తీర్చాలి : కలెక్టర్

కలెక్టరేట్, ఏప్రిల్ 28 : పశువులు, పక్షుల దాహం తీర్చేందుకు మనవంతు సహకారం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో మూగజీవాలు చుక్క నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయని, పక్షి జాతుల్లో కొన్ని అంతరించిపోవడానికి వేసవి కూడా ఒక కారణమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పశువులు, పక్షుల దాహం తీర్చడానికి మనవంతు సహకారం అందించాలని తెలిపారు. మన ఇంటిప్రాంగణంలో గిన్నెలో నీళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల, పక్షుల సంరక్షణకు కావాల్సిన ఆహారం, నీళ్లు, షెల్టర్ ఇతర వైద్య సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## ప్రమాదానికి కారణమైన హార్వెస్టర్ డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: హార్వెస్టర్‌పై వేగంగా, అజాగ్రత్తగా వచ్చి మల్లారెడ్డిపేటకు చెందిన గాజులపల్లి ముత్యంను ఢీకొట్టినందుకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. శనివారం రాత్రి మల్లారెడ్డిపేటకు బైక్‌పై వెళ్తున్న ముత్యంను ఎదురుగా హార్వెస్టర్‌ను నడుపుతూ వచ్చిన మహారాష్ట్రకు చెందిన రాజుబాపు ఢీకొట్టాడు. తీవ్రగాయాలపాలైన బాధితున్ని చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించిన అతని కుమారుడు దిలీప్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. దీంతో హార్వెస్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

## పూడిక తీస్తుండగా బావిలో పడ్డ క్రేన్

- కూలీ మృతి, మరొకరికి గాయాలు

సహాయక చర్యల్లో నిమగ్నమైన పోలీసులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 28: పూడికతీత పనుల్లో ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడి కూలీ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యా యి. ఎస్ఐ మారుతి తెలిపిన వివరాల ప్రకారం, వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రా మానికి చెందిన అంజ య్య తన వ్యవసాయబావిలో పూడికతీత కోసం మండలంలోని ఫాజుల్‌నగర్‌కు చెందిన దండుగుల కొమురయ్యకు గుత్తకు ఇచ్చాడు. ఆదివారం యథావిధిగా బావిలో నుంచి మట్టి తీస్తుండగా, బావి పక్కనే ఉన్న క్రేన్‌తోపాటు క్రేన్ నడుపుతున్న దండుగుల మల్లవ్వ(70), దేవయ్య బావిలో పడ్డారు. మల్లవ్వకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. దేవయ్యకు స్వల్ప గాయాలు కాగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. మల్లవ్వ మృతదేహాన్ని పోలీసులు ప్రత్యేకంగా క్రేన్ ఏర్పాటు చేసి బయటకు తీశారు. క్రేన్‌తో పాటు మల్లవ్వ బావిలో పడే సమయంలో బావిలో కొమురయ్య, గంగమణి ఉన్నట్లు బాధితులు తెలిపారు. మల్లవ్వ మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా దవఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డుప్రమాదంలో మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొప్పాపూర్‌కు చెందిన మట్ట దీప్తి (45) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొంతకాలంగా మట్ట దీప్తి భర్త సురేశ్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఆదివారం నిర్మల్‌లో ఉన్న తమ బంధువులింట్లో ఓ శుభకార్యానికి కారులో ఇద్దరు బయలుదేరారు. డిచ్‌పల్లిలో కారు అదుపుతప్పి బోల్తాపడగా దీప్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194